# గజారోహణం

మంతెన సూర్యనారాయణరాజు



ఆ రోజు శుక్రవారం. ప్రసన్న రాఘవస్వామిగారు ప్రతి శుక్రవారం చేస్తున్నట్లుగానే బట్టల కొట్టు యజమానితో మధ్యమధ్య మాట్లాడుతూ లక్ష్మీదేవికి కుంకుమ పూజ చేస్తూ మంత్రాలు ఉచ్చరిస్తున్నాడు. ఈ లోగా అక్కడికి పిట్టల దొరలాంటి వేషం వేసుకున్న వ్యక్తి వచ్చాడు. బట్టలకొట్టుయజమాని నిత్యానంద రావు కౌంటర్‌లోంచి వ్యాపార సంబంధమైన చిరునవ్వు ముఖానికి పులుముకుంటూ లేచి లోనికి రండన్నట్లు స్వాగతం పలికాడు. ఆ వ్యక్తి లోనికొచ్చి స్టూల్‌మీద కూర్చున్నాడు. ప్రసన్న రాఘవస్వామి లక్ష్మిపూజ కానిస్తూనే మధ్య మధ్య లోనికొచ్చి కూర్చున్న వ్యక్తిని గమనిస్తున్నాడు.

